# పెంపకం

**-రావి-ఎన్-అవధాని**

''భగవద్గీతలో శ్లోకాలు శ్రావ్యంగా ఎంతో అర్ధవంతంగా చదివేవు! నీ పేరేంటమ్మా'' అన్నారు ప్రభావతిగారు.

''నమస్కారం. నాపేరు కాత్యాయని అండి''

కాత్యాయనికి సుమారు పదిహేను సంవత్సరాల వయస్సుంటుంది. కడిగిన ముత్యంలా వుంది. పసిమిరంగు శరీరఛాయ, గుండ్రటిముఖం, చురుకైన కళ్లు. లంగా జాకెట్టు వేసుకుంది. ఆ బట్టలు చవకరకానివైనా చాలా నీటుగా వున్నాయి. తల నున్నగా దువ్వుకొని రెండు జడలు వేసుకొంది.

ఎంతో వినయంగా వున్న ఆ అమ్మాయిని చూసి ముచ్చట పడ్డారు ప్రభావతిగారు. చిన్న చిరునవ్వు నవ్వి.

''ఎంతవరకూ చదువుకున్నావు? నీకు సంస్కృతం వచ్చా?''

''టెన్త్ ఫస్టుక్లాసులో పాసయ్యేనండి. మా తాతగారి వద్ద సంస్కృతం, పంచకావ్యాలూ పూర్తి చేసేనండి.''

''కాలేజీలో పై చదువులు చదవటం లేదా?''

''లేదండి. అంత ఆర్థిక స్తోమత లేదు''అంది విచారంగా.

''మీ ఫాదరు ఏం చేస్తుంటారు?''

''లేరండి''

''మదరు?''

కాత్యాయని వదనం చిన్నబోయింది. విచ్చిన ప్రభావతిగారి కళ్లల్లోకి చూసి తలదించుకొని ''లేరండి'' అంది.

ప్రభావతిగారి హృదయం కలుక్కుమంది.

పర్సులోంచి ఏభై రూపాయల నోటు తీసి కాత్యాయని చేతిలో వుంచబోయేరు.

''ఎందుకూ? నాకు వొద్దండి'' అంటూ రెండడుగులు వెనక్కి వేసింది కాత్యాయని.

''తప్పమ్మా! పెద్దవారు ఆశీర్వదించి యిస్తున్నది పిల్లలు నిరాకరించకూడదు'' అని కాత్యాయన్ని బలవంతం చేసి ఇచ్చింది.

''నా పేరు రాజేశ్వరి. యీ 'లలితా భక్త మహిళా మండలి' ప్రెసిడెంట్‌ని. నాలుగు నెలల క్రితం వరకూ కాత్యాయని తాతగారు రోజా యిక్కడ పురాణం చదివి వినిపిస్తూ మాలో భక్తిభావం పెంపొందింప జేసేరు. వారు కాలం చేయడం వల్ల కాత్యాయని, వాళ్లమ్మమ్మ గారు అనాథలయ్యేరు. వీళ్లు గొప్ప అభిమానవంతులు. మేము యీ అమ్మాయికి నెలకి మూడు వందలిస్తూ రోజా ఒక గంట సేపు భగవద్గీత, వాల్మీకి రామాయణం, సుందరాకాండ ఏదో ఒకటి చదివించుకొని వింటూ వుంటాము.''

''ఈ ఉమాతారకేశ్వర ఆలయ కళ్యాణ మండపం మా మహిళా మండలి తరఫున చందాలు వసూలు చేసి కట్టించేము. మహిళా మండలిలో నూట ఏభైమంది మెంబర్లు వున్నారు. నెలకి చందా పది రూపాయలే. మీరు యీ వూరికి క్రొత్తగా వచ్చేరా? ఎక్కడ వుంటున్నారు. మా మహిళా మండలిలో మీరు కూడా చేరండి'' అన్నారు రాజేశ్వరిగారు.

ప్రభావతిగారు చిరునవ్వు నవ్వేరు.

''కాత్యాయనీ..యీ ఆదివారం మా యింట్లో 'హనుమద్వ్రతం' చేస్తాను. ఆరోజు వుదయం నీకు వీలుంటే సుందరాకాండ పుస్తకం తెచ్చి మా యింట్లో ఒక గంట పారాయణ చేయగలవా?''

''తప్పకుండా వస్తుందండి. వాళ్లమ్మమ్మగారికి నేను చెప్పి పంపిస్తాను'' అన్నారు రాజేశ్వరిగారు.

''ఎన్ని గంటలకు రాగలవు? మీ యిల్లెక్కడో చెప్తే కారు పంపుతాను''

''కారు వద్దండి. నేను ఏడు గంటలకు వస్తాను అడ్రస్సు చెప్పండి'' అంది కాత్యాయని మరి వారి కోరిక నిరాకరించలేక.

ప్రభావతి గారు పర్సులోంచి తన విజిటింగ్ కార్డు తీసి కాత్యాయని చేతిలో వుంచి వెనుతిరిగి బయటకు వెళ్లిపోయేరు.

ప్రభావతిగారు వెళ్ళిపోయిన తరువాత కాత్యాయని తన చేతిలో వున్న విజిటింగ్ కార్డు చూసి అదిరిపడింది.

''కుమారి ప్రభావతి, జిల్లా కలెక్టరు'' అని వున్నదానిని చూసి-

'అంటే తను యింతవరకూ మాట్లాడిందీ, తనను మెచ్చుకొని వారింటికి సుందరాకాండ పారాయణకు ఆహ్వానించిందీ యీ జిల్లాధికారిణి గారా?' ఆనందంతో కాత్యాయని మనస్సు వుప్పొంగిపోయింది.

ఆవిడ జిల్లా కలెక్టరుగారని తెలియక ఆమె ముందు ఏమేమో వాగినందుకు ఎంతగానో నొచ్చుకున్నారు రాజేశ్వరిగారు.

'ఆదివారం వుదయం కలెక్టరుగారిని కల్సినప్పుడు అమ్మమ్మ పెన్షన్ విషయం ఓమారు వారి చెవిని వెయ్యాలను'కుంది కాత్యాయని.

ప్రభావతిగారు గత పది సంవత్సరాలు ఉత్తర భారతదేశంలో అనేక చోట్లవుద్యోగం చేసి వారం రోజుల క్రితమే వచ్చి విజయనగరంలో ఛార్జీ తీసుకొన్నారు. ఆరోజు ఏదో పని మీద వెళ్ళి వస్తూ శ్రావ్యంగా వినవస్తున్న భగవద్గీత విని కారు ఆపుచేయించి లోనికి వెళ్లి కాత్యాయనిని చూసేరు. ఆ అమ్మాయిని చూసినప్పటినుండీ ప్రభావతిగారి మనస్సు ఎందువలనో కలత చెందింది.

★★★

విశ్వేశ్వర శాస్త్రిగారు గొప్ప సంస్కృత పండితులు. సంస్కృత కళాశాలలో అధ్యాపకులు. వారు వ్యాకరణం, తర్క మీమాంశ శాస్త్రాల్లో దిట్ట.

శాస్త్రిగారి ఏకైక సంతానం ప్రభావతి. చదువుల సరస్వతి. బి.ఏ. యూనివర్సిటీ ఫస్టు. బంగారు పతకం తెచ్చుకుంది. ఎమ్.ఏ. ప్రయివేటుగా చదివి ఫస్టుక్లాసు తెచ్చుకుంది. శాస్త్రిగారి కుటుంబ సాంప్రదాయం, అమ్మాయి చదువు, చక్కదనం చూసి ఆదిత్య అనే కుర్రాడు ప్రభావతిని కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటానన్నాడు. ఆదిత్యకు, శాస్త్రిగారికి దూరపు బంధుత్వం కూడా వుంది. ఆదిత్యకు తోబుట్టువలు లేరు. ఒక్కడే సంతానం. అతని తండ్రి సంవత్సరం క్రితమే పోయేరు. తల్లి వుంది. ఆదిత్య ఎమ్.ఎ.చదివి ఒంగోలులో జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు.

శాస్త్రిగారి స్నేహితులు, హితుల ప్రోద్బలం వల్ల కూతురు పెళ్లి ఘనంగా చేసేరు. పెళ్లి ఖర్చులకు కావల్సిన డబ్బు పి.ఎఫ్.మీద లోను తీసుకొన్నారు.

అల్లుడు రోజా ఆరు కిలోమీటర్లు బస్సులో పడిగాపులుపడి కాలేజీకి వెళ్లివస్తున్నాడని తెల్సుకొని కొద్దిగా బాధపడ్డారు శాస్త్రిగారు.

''బాబూ ఆదిత్యా! నేను మరో నాలుగు నెలల్లో రిటైరవబోతున్నాను. రిటైర్‌మెంట్ బెనిఫిట్సు వస్తాయి. పాతికవేలు యిస్తాను. మంచి స్కూటరు కొనుక్కో'' అన్నారు శాస్త్రిగారు అమ్మాయి సీమంతం రోజున.

అనుకోకుండా శాస్త్రిగారు మరో సంవత్సరం ఉద్యోగంలో కొనసాగడం వల్ల డబ్బు చేతికందలేదు. అల్లుడి స్కూటరు కూడా దాంతో వాయిదా పడింది. ప్రభావతికి కూతురు పుట్టిన విషయం అల్లుడికి తెలియపరచి నామకరణోత్సవానికి రమ్మని వుత్తరం రాసేరు.

''మాకు నామకరణోత్సవం అచ్చిరాదు. నాకు సెలవు లేదు. వీలు చూసుకొని ప్రభావతిని, పిల్లను తీసుకువచ్చి దిగబెట్టమని''జాబు రాసేడు ఆదిత్య.

శాస్త్రిగారు అల్లుడు కోరినవిధంగా కూతుర్ని, మనుమరాలిని దిగబెట్టి, ''డబ్బు చేతికి అందిన వెంటనే పంపుతాను. మరోలా అనుకోవద్దని'' అల్లుడికి చెప్పి వచ్చేరు.

ప్రభావతికి రోజా అత్తగారి సాధింపులూ, భర్త ఛీత్కారాలు ఎక్కువయ్యాయి. ఆదిత్య భార్యపై ఒకటి రెండుమార్లు చెయ్యి చేసుకున్నాడు.

''చూడు, మీ నాన్న సీమంతం నాడు పాతికవేలు యిస్తానన్నాడు. నీవు వెంటనే వెళ్లి మీ నాన్ననడిగి డబ్బు తీసుకొనిరా. డబ్బు తీసుకురాకుండా మళ్లీ యీ గుమ్మంలో అడుగు పెట్టవద్దు'' అన్నారు ప్రభావతితో ఆమె అత్తగారు- ఒకరోజున

ప్రభావతికి పౌరుషం వచ్చింది. లోనికివెళ్లి పెట్లో బట్టలు సర్దుకొంది. కూతుర్ని చంకను వేసుకొని పెట్టె పట్టుకొని బయటకు వచ్చింది.

''పసిపిల్లనెందుకు వూర్లంట తిప్పడం! నువ్వెళ్లి

డబ్బు తీసుకొనిరా'' అంటూ ప్రభావతి చంకలోని పిల్లను బలవంతంగా తీసుకొని ప్రభావతిని బయటకు నెట్టి, వీధి తలుపు గడియ వేసేరు ప్రభావతి అత్తగారు.

అంతా గమనిస్తున్న ఆదిత్య నోరు విప్పకపోవడంతో ప్రభావతికి రోషం ఎక్కువైంది.

''కూతురు కోసం తెల్లారే సరికి డబ్బు పట్టుకొస్తుంది. చూస్తూ వుండు'' అన్నారు ఆదిత్యతో అతని తల్లి.

ప్రభావతి ఆ క్షణంలో ఒక తిరుగులేని 'నిర్ణయం' తీసుకొంది.

''పుట్టింటి నుండీ డబ్బు తెమ్మని వేధించే వారు 'మేనీటర్సు' లాంటి వారు. రుచిమరిగితే మరి విడిచిపెట్టనే పెట్టరు. వారినుండీ దూరంగా వుండడమే మంచిది. అయితే తల్లిదండ్రులకు బరువు కాకూడదు. తన కాళ్లమీద తాను నిలబడి తన లక్ష్యం సాధించాలి. అందుకోసం వెంటనే వుద్యోగ ప్రయత్నం చేయాలి.'' అనుకుంది.

ఖాళీగా వెళ్తున్న రిక్షా ఆపి అందులో కూర్చుని నేరుగా స్టేషన్‌కి వెళ్లింది. రాజమండ్రి వెళ్లడానికి బదులు హైదరాబాదు వెళ్లింది. అక్కడ ప్రభావతి ఫ్రెండు కమల కాన్వెంటు స్కూలు నడుపుతూంది. ఆమె భర్త రాజారాం లాయరు. వారికి తన వృత్తాంతం చెప్పి వారి సహాయంతో ఒక ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా జాయిన్ అయింది.

శాస్త్రిగారికి డబ్బు అందగానే పాతిక వేలకు డ్రాఫ్ట్ తీసుకొని అల్లుడికి రిజిస్టర్డ్ పోస్టులో పంపేరు. మిగిలిన డబ్బుతో వూళ్లోవున్న చిల్లర బాకీలన్నీ తీర్చివేసేరు.

ఓ వారం రోజుల తరువాత కూతురు, అల్లుడు, మనుమరాలుని చూసి వద్దామని బయలుదేరి వెళ్లేరు.

మామగారు వంటరిగా రావడం చూసి ఆశ్చర్యపోయేడు ఆదిత్య. ''ప్రభావతిని ఎందుకు తీసుకొని రాలేదో?'' అనుకున్నాడు.

''ఏం బాబూ! అందరూ కులాసాగా వున్నారా? డ్రాఫ్ట్ అందిందికదా? స్కూటరు తీసుకొన్నావా? సొమ్ము చేతికందేసరికి కొంత ఆలశ్యం అయింది. అక్కడికీ తెలిసిన వాళ్లుండబట్టి పని తొందరగా జరిగింది. లేకుంటే యింకా జాప్యమవుతుందిట'' అన్నారు శాస్త్రిగారు.

ఆదిత్య సమాధానమియ్యకుండా ముభావంగా వూరుకున్నాడు. శాస్త్రిగారు బాధపడ్డారు.

''ప్రభ ఏదీ?'' అన్నారు-నుదిటిని పట్టిన చెమట కండువాతో వొత్తుకుంటూ.

ఆదిత్య అదిరిపడ్డాడు.

మనుమరాలిని చంకను వేసుకొని వంటింట్లోంచి బయటకు వస్తున్న ఆదిత్య తల్లి శాస్త్రిగారి ప్రశ్నకు వులిక్కి పడింది.

''అదేమిటి? ప్రభావతి మీ యింటికేగా వచ్చింది!'' అన్నారు తల్లీ,కొడుకులు కోరస్‌గా.



వారి మాటలకు శాస్త్రిగారు హడలిపోయేరు.

''మా యింటికి రావడం ఏమిటండీ? పాలు త్రాగే పసిపిల్లను యిక్కడ వదలిపెట్టి ఎలా రాగల్దండీ? ఏం జరిగిందో వివరంగా చెప్పండి''

''క్రిందటి ఆదివారం నాడు మిమ్మల్ని చూసి వస్తానని బయల్దేరి వెళ్లింది. చంటి దాన్నెందుకు రైళ్లల్లో త్రిప్పటం, నేను సాయంత్రానికల్లా వచ్చేస్తానని చెప్పి వెళ్లింది. వారం రోజులైనా రాలేదు. పైగా ఏ సంగతీ తెలియజేయలేదు. పసిదానిని వదలి వచ్చేనన్న విచారం కూడా లేదు. మీ ఆరోగ్యం బాగులేక వుండిపోయిందేమో అనుకుంటున్నాం. అబ్బాయికి యీ రోజు శలవు. వెళ్ళి చూసి రమ్మన్నాను'' అన్నారు ఆదిత్యతల్లి-గంభీరంగా.

''అబద్ధం! అమ్మాయి ఎప్పుడూ అంత మూర్ఖంగా ప్రవర్తించదు. అమ్మాయిని మీరే ఏదో చేసి వుంటారు. నేను మీకు తొందరగా డబ్బు పంపలేదనే కక్షతో... ఏం చేసేరు నా బిడ్డను, చెప్పండి'' అన్నారు శాస్త్రిగారు కోపంతో.

''ఏవిటయ్యా దబాయిస్తున్నావ్! మేం చెప్పింది అక్షరాలా నిజం. అమ్మాయి మీ యింటికి రాలేదంటే....ఎవడితోనో లేచిపోయి వుంటుంది-కన్నబిడ్డను మా ఎదాన్న వదలి, ఖర్మ'' అన్నారు బిగ్గరగా.

శాస్త్రిగారికి తలపై పిడుగు పడినట్లయింది. కూతురేమైందో తెలియటం లేదు. ఆదిత్య నోరు విప్పి మాట్లాడడం లేదు. ఏం చెయ్యాలో తోచటం లేదు. వారితో యిక వాదించినా లాభం వుండదనుకొని చేతి సంచీ తీసుకొని బయల్దేరేరు.

''యీ లంపటం మాకెందుకు? దీన్ని కూడా తీసుకొని వెళ్లు'' అంటూ చంకలో వున్న పిల్లను వీధి గుమ్మంలో కుదేసి భళ్లున తలుపులు మూసేరు ఆదిత్య అమ్మగారు.

శాస్త్రిగారు క్షణకాలం నివ్వెరపోయి మనుమరాలిని ఎత్తుకొని బయల్దేరేరు.

''ముసలివాడు ఏం రాద్ధాంతం చేస్తాడోనని హడలిపోయేను! తొందరగానే వదలిపోయేడు. యింతకూ ప్రభ ఏమైనట్లు'' అనుకున్నాడు ఆదిత్య.

''యీ వయస్సులో నాకీ శిక్ష ఏమిటి? అమ్మాయి ఏమైంది. డబ్బుకోసం వారేమైనా చేసేరా?'' అని ఆలోచిస్తూ పరధ్యాన్నంగా నడుస్తూ ప్రక్కగా వచ్చి ఆగిన జీపును చూసి తృళ్లిపడ్డారు శాస్త్రిగారు.

జీపులోని వ్యక్తి క్రిందకు దిగి వచ్చి ''నమస్తే అంకుల్'' అన్నాడు. శాస్త్రిగారు చేతిసంచీని రెండు కాళ్లమధ్య అదిమిపట్టి ముఖాన పట్టిన చెమటను కండువాతో తుడుచుకొన్నారు. అతని వేపు ఆశ్చర్యంగా చూస్తూ.

''ఇంత ఎండలో చంటి పిల్లను భుజాన వేసుకొని ఎక్కడికి వెళ్తున్నారు? రిక్షాలో వెళ్లలేకపోయారా? ఈ వూళ్లో వుంటున్నారా? అమ్మాయి ఎక్కడుంటుంది?''

తన ఎదురుగా పోలీసు యూనిఫారం వేసుకొని ప్రశ్నల వర్షం కురిపిస్తున్న వ్యక్తి ఎవరో పోల్చుకోలేకపోయేరు శాస్త్రిగారు.

''నేను అంకుల్, గోపాలాన్ని. విశ్వనాధం గారి అబ్బాయిని.'' అని తనను పరిచయం చేసుకున్నాడు.

''నువ్వా బాబూ! పోల్చుకోలేకపోయాను! అమ్మా నాన్నా బావున్నారా? యీ వూర్లో వుంటున్నావా?'' అన్నారు తడారిన గొంతుకతో.

శాస్త్రిగారి పరిస్థితి చూసిన గోపాలం ''ముందు జీపు ఎక్కండి అంకుల్. ప్రక్క వీధిలోనే మా యిల్లు. యింటి వద్ద అన్ని విషయాలూ మాట్లాడుకుందాము'' అని శాస్త్రిగారిని వాళ్లింటికి తీసుకొని వెళ్లి తన భార్యను పరిచయం చేసేడు. తను ఆ వూర్లో యస్.పి గా వచ్చి చేరి రెండు నెలలైందని చెప్పేడు.

శాస్త్రిగారు గోపాలం భార్య యిచ్చిన మంచి నీళ్లు, కాఫీ త్రాగి కొంత స్థిమితపడి జరిగిన విషయమంతా చెప్పేరు.

''అమ్మాయి ఏమయిందో? డబ్బుకోసం వాళ్లేమైనా ఘోరం చేసేరో తెలియటం లేదు బాబూ'' అన్నారు జీరపోయిన గొంతుకతో.

''డబ్బు కోసం వాళ్లు ఆమెను శారీరకంగా కాని, మానసికంగా కాని హింసించిన విషయం ఎప్పుడైనా చెప్పిందా?''

''మేము బాధపడతామని అమ్మాయి ఏ విషయమూ మాతో చెప్పదు. అమ్మాయి చాలా అభిమానవంతురాలు. మాటపడదు. అన్నట్లు యిరవై రోజుల క్రిందట ఒక వుత్తరం రాసింది. సంచీలోనే వుండాలి'' అంటూ సంచీలో వెదకి వుత్తరం తీసి గోపాలానికిచ్చేరు.

''నాన్నగారూ.. మీరు పెద్దమనసుతోనూ, అల్లుడిమీద మమకారం తోను వారికి మీ రిటైర్‌మెంటు బెనిఫిట్సు వచ్చేక స్కూటరు కోసం పాతికవేలిస్తానన్నారు. డబ్బు మీ చేతికి రాకుండా ఆనాడు మీరు చేసిన వాగ్దానం యీనాడు నా ప్రాణం మీదకు వచ్చింది. వీలైనంత త్వరలో ప్రయత్నించి డబ్బు సంపండి- మీ ప్రభ'' అని చదివి, 'అంకుల్..యీ వుత్తరం చాలు మాకు' అని స్టేషన్‌కి ఫోను చేసి యస్.ఐని యింటికి పిలిపించి శాస్త్రిగారి చేత ఒక కంప్లైంటు రాయించి తీసుకొని వెంటనే ఇన్వెస్టిగేట్ చెయ్యమన్నారు.

''మీరేం దిగులు పడకండి అంకుల్. అన్ని విషయాలూ నేను చూసుకుంటాను'' అని హామీ యిచ్చి శాస్త్రిగారిని, వారి మనుమరాలిని సాయంత్రం రైలు దగ్గరుండి ఎక్కించి పంపించేడు.

''మనుమరాల్ని తీసుకొచ్చేరా? మీ అమ్మాయి రాలేదా? ఆమెకు ఏమైంది? చంటిపిల్లను విడిచి, ఎలా వుండగల్గింది'' అని యిరుగు పొరుగు వారు వేయబోవు ప్రశ్నలను ఎదుర్కోవడం యిష్టం లేక శాస్త్రిగారి భార్యకు వాళ్ల తాతగారు యిచ్చిన చిన్న పెంకుటిల్లు విజయనగరంలో వుంది. అక్కడకు ఎవ్వరితోనూ చెప్పకుండా మకాం మార్చి వేసేరు భార్యను, మనుమరాలిని తీసుకొని.

మనుమరాలు తల్లికోసం బెంగపెట్టుకోకుండా వారికి చేరువ అవడంతో కొంతలో కొంత ఊరట చెందేరు శాస్త్రిగారు.

పోలీసు కేసులో యిరుక్కున్న ఆదిత్య ఉద్యోగం పోగొట్టుకొని రోడ్డున పడ్డాడు. ప్రభావతి ఏమైందో అతనికి అర్థం కావడం లేదు. తను చెప్పిందేదీ పోలీసులు నమ్మడం లేదు.

తల్లీ, పిల్లలను వేరు చేసిన పాపం వెంటనే అనుభవంలోకి వచ్చింది ఆదిత్య తల్లికి. కొడుకు పైన వచ్చిన పోలీసు కేసు, ఉద్యోగం పోవడం ఆమె తట్టుకోలేకపోయేరు. పక్షవాతం వచ్చి నోరు, కాలు, చెయ్యి చచ్చుపడిపోయి మంచాన పడ్డారు.

★★★

రాజారాంగారికి తోబుట్టువులు లేని కారణాన ప్రభావతిని సొంత చెల్లెలులా అభిమానిస్తున్నారు. వారింటిలోనే రెండు గదుల పోర్షన్‌లో వుంటున్నది.

ప్రభావతికి తన మొదటి ఆశయం-'ఉద్యోగం సంపాదించడం' నెరవేరడంతో కొండంత ధైర్యం వచ్చింది. తన రెండో ఆశయం-ఆదిత్య నుండి డైవోర్సు పొంది, ఐ.ఎ.యస్.పాసై కలెక్టరవడం. కూతుర్ని, తల్లిదండ్రులను తెచ్చి తన దగ్గరుంచుకోవడం.

లాయరు రాజారాంగారి పలుకుబడితో విడాకులు వెంటనే పొందగల్గింది. అయితే తన ఉనికిని మాత్రం వాళ్లకు తెలియనీయలేదు. తన కూతుర్ని తన తండ్రి వచ్చి తీసుకు వెళ్లిన విషయం తెల్సుకొని ఎంతో ఆనందించింది. తల్లిదండ్రులకు జరిగిన విషయాలు స్వయంగా చెప్పి వారిని తనతో హైదరాబాదు తీసుకొని రావాలని రాజమండ్రి వెళ్లింది. వారు ఆ వూరు విడిచి వెళ్లిపోయిన సంగతి తెల్సుకొని నిరాశ చెందింది. ఎక్కడకు వెళ్లేరో తెలియక ఎంతో కలత చెంది తిరిగి వచ్చింది.

ఎంతో పట్టుదలతో చదివి ఐ.ఎ.యస్. పాసయి కలెక్టరుగా వుద్యోగం సంపాదించి తన ఆశయం నెరవేర్చుకుంది. సుమారు పది సంవత్సరాలు నార్తులో పలుచోట్ల పనిచేసి విజయనగరం వచ్చింది.

ఎంత ప్రయత్నించినా తల్లిదండ్రులు, కూతురు జాడ తెల్సుకోలేకపోయింది ప్రభావతి.

ఆదివారం ఉదయం సరిగ్గా ఏడోగంటకి కాత్యాయని కలెక్టరు ప్రభావతి గారింటికి వచ్చి, కాళ్లకున్న ప్లాస్టిక్ చెప్పులు మెల్లవారగా వుంచి గార్డెనులో వున్న పైపు దగ్గర కాళ్లు కడుక్కొని కొద్దిగా భయపడుతూ గుమ్మంలో నిల్చుని ''ఏమండీ'' అని పిల్చింది.

ప్రభావతిగారు బయటకు వచ్చి ''అదేమిటి కాత్యాయనీ అక్కడే నిల్చుండిపోయేవు? లోపలకు రా'' అంటూ ఆప్యాయంగా పిలిచేసరికి కొంత ధైర్యం వచ్చింది. ప్రభావతి గారికి నమస్కరించి.

''క్షమించండి అమ్మగారూ. ఆరోజు ముందు మీరు కలెక్టరు అని తెలీక ఏదైనా పొరపాటు చేసివుంటే....''

''పర్వాలేదు..రా..వచ్చి కూర్చో'' అన్నారు చిరునవ్వుతో.

''సుందరాకాండ పుస్తకం తెమ్మన్నారు, యిదుగోనమ్మగారు తెచ్చేను'' అంటూ పుస్తకం ప్రభావతిగారికి చూపించింది.

ప్రభావతిగారు పుస్తకాన్ని కాత్యాయని చేతిలోంచి అందుకొని కళ్లకద్దుకొని అట్ట తిరగవేసి దాని మీద కరక్కాయ సిరాతో రాసిన 'విశ్వేశ్వర శాస్త్రి' అని తన తండ్రి పేరు క్రింద, ఆయన సంతకం చూసి అదిరిపడ్డారు.

''ఈ పుస్తకం నీకెక్కడిది?! అన్నారు ఉద్వేగంతో.

కాత్యాయని హడలిపోయింది.

''నాదేనండీ..మాతాతగారిది'' అంది భయంగా.

''అంటే విశ్వేశ్వర శాస్త్రిగారు..''

''మా తాతగారేనండీ. వారు నాలుగు నెల్లక్రితం చనిపోయేరు''

''అన్నపూర్ణమ్మ..''

''మా అమ్మమ్మే నండి! వార్ని మీరెరుగుదురాండి?!''

''ఎరగడమేమిటమ్మా! కాత్యాయనీ! నేనమ్మా..నేను..మీ అమ్మనమ్మా! నువ్వు నా కన్న కూతురివమ్మా'' అంటూ కాత్యాయనిని పట్టుకొని ఆప్యాయంగా హృదయానికి హద్దుకొనబోయేరు-పట్టరాని ఆనందంతో ప్రభావతిగారు.

కాత్యాయనికి దుఃఖం ఒక్కమారు పెల్లుబికి వచ్చింది. ప్రభావతిగారి చేతిలోంచి విడిపించుకొని నాలుగడుగులు వెనక్కివేసి-

''క్షమించండమ్మగారూ, మీరంటున్నదేంటో నాకర్థం కావటం లేదు. నేను విశ్వేశ్వరశాస్త్రిగారి మనుమరాలినే కాని మీ కూతుర్ని మాత్రం కాను. నాకు తల్లీ, తండ్రీ లేరు. నా చిన్నతనంలోనే పోయేరుట. అంతేకాదు, మీరు 'కుమారి ప్రభావతి'గారు కదా! మా అమ్మెలా అవుతారు? మీ అమ్మాయి తండ్రి ఎవరంటే ఏం సమాధానం చెప్తారు? నాకు అమ్మా నాన్నా ఎవ్వరూ లేరు'' పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకొని ప్రభావతిగారి చేతిలో నుండి తన పుస్తకం లాక్కొని కాత్యాయని పరుగులాంటి నడకతో బయటకు వెళ్లిపోయింది.

నిర్ఘాంతపోయి కాత్యాయని వెళ్లిన వేపు చూస్తూ నిల్చుండిపోయేరు ప్రభావతిగారు.

★

